www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 మార్చి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

పురుగు మందు తాగిన కౌలు రైతు మృతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అప్పుల ఊబిలో కూరుకుపోయిన కౌలు రైతు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెలిచేరు గ్రామానికి చెందిన పోసింశెట్టి లక్ష్మణరావు (34)కు ఇద్దరు పిల్లలు సంతానం. కౌలుకు వ్యవసాయం చేస్తూ భార్యాభర్తలను పోషించుకుంటున్నాడు. ఇటీవల కౌలుకు తీసుకున్న పొలం సరిగ్గా పంట దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరకుపోయిన లక్ష్మణ్ రావు మనస్తాపంతో ఈ నెల 9న వెలిచేరులో పురుగు మందు తాగాడు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం స్మార్ట్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటినుండి చికిత్స పొందుతున్నాడు సోమవారం పరిస్థితి విసమించడంతో మృతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

నాడు హామీలు... నేడు అరెస్టులా...

- పలుచోట్ల అంగన్‌వాడీల నిర్బంధం
- ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం
- కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా

అంగన్‌వాడీలు చేపట్టిన చలో విజయవాడపై ప్రభుత్వం నిర్బంధకాండకు దిగింది. ముందస్తుగా సంబంధిత అధికారులకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ధర్నాకు విజయవాడ వెళ్తున్నట్లు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వ ఒత్తిడితో ఐసిడిఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్‌ల పేరుతో అంగన్‌వాడీలను చలో విజయవాడకు వెళ్లకుండా కుట్రలు సాగించారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీలు వీరి కుట్రలను ఎదుర్కొని విజయవాడకు తరలివెళ్లారు. తుని, సామర్లకోట ప్రాంతాల్లో అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అధికారుల ఒత్తిడితో సెక్టార్ మీటింగ్‌లకు హాజరైన అంగన్‌వాడీలు అక్కడే తమ నిరసనను వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కనీస వేతనాల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన 42 రోజుల సమ్మె సందర్భంగా తెలుగుదేశం నేతలు న్యాయమైన కోర్కెలను తీర్చుతామని నాడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయాలని కోరిన అంగన్‌వాడీలను అరెస్టు చేయడం దారుణమని సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు బయలు దేరిన అంగన్‌వాడీలను తుని, సామర్లకోట ప్రాంతాల్లో పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కచేరిపేట సుందరయ్య భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, శంఖవరం రాజేశ్వరి, పిఠాపురం గంగాభవాని మాట్లాడుతూ చారిత్రక 42 రోజుల అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా శిబిరాల వద్దకు వచ్చి కూటమి ప్రభుత్వం రాగానే అంగన్‌వాడీల

సామార్లకోటలో అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా జీతాలు పెంచకపోవడాన్ని వారు తప్పుపట్టారు. బతికుండగా వేతనాలు పెంచకుండా, చనిపోయాక మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని అంగీకరించి, రూ.15 వేలే చెల్లించేలా జీవో ఇచ్చినందుకు కూటమి నేతలు సిగ్గుపడాలన్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించి చేతులు దులుపుకుంటామంటే ఒప్పుకునేదిలేదన్నారు. సెంటర్ అద్దెలు, వంట ఖర్చులు నెలల తరబడి బకాయిలు పెడితే ఇచ్చే రూ.11వేల వేతనం వీటికే సరిపోతుండగా, కుంటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. తక్షణమే అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మొబైల్ యాప్ పని భారాన్ని తగ్గించాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లుగా గ్రాడ్యుటి చట్టాన్ని అమలు చేయాలని, మినిట్స్‌లో అంగీకరించిన అంశాలన్నింటికీ జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, వర్కింగ్ కమిటీ సభ్యులు మెడిశెట్టి వెంకటరమణ, అంగన్‌వాడీలు సత్యవతి, వీరవేణి, నారాయణమ్మ, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కాజులూరు, గొల్లపాలెం సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీలను సూపర్‌వైజర్లు సెక్టార్ మీటింగ్ పేరుతో అడ్డుకున్నారు. చలో విజయవాడపై పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించడంతో కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలతో ధర్నాకు వెళ్లమని వారితో సంతకాలు పెట్టించుకుని అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీలు సెక్టార్ మీటింగ్ వద్దే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సెక్టర్ లీడర్ హనుమావతి మాట్లాడుతూ కాకినాడలో జరిగే ధర్నాకు సైతం వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం కోలంక సెక్టర్ లీడర్లు వరలక్ష్మి, అన్నవరం అంగన్‌వాడీలు సలాది లక్ష్మి, నందికోళ్ల నాగమణి, మాత శేషారత్నం, మామిడి ప్రసన్న, కె.అరుణ పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక రైల్వే స్టేషన్ వద్ద సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. చలో విజయవాడ వెళ్లకుండా వారిని అడ్డగించి వెనుకకు పంపివేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అంగన్‌వాడీలను గృహనిర్బంధాలకు, అరెస్టులు చేయడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే వైసిపికి పట్టిన గతే కూటమి పార్టీలకు పడుతుందని హెచ్చరించారు. **శంఖవరం** ఛలో విజయవాడ బయలు దేరిన అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి అన్నవరం రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయం చేయాలని కోరుతున్న తమను అడ్డుకోవడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బుల్లెమ్మ అన్నారు.

పెరవలి : చలో విజయవాడ నేపథ్యంలో మండలంలోని అంగన్‌వాడీలపై పోలీసులు నిర్బంధం విధించారు. పెరవలి ఐసిడిఎస్ పరిధిలోని నిడదవోలు, పెరవలి మండలాల నుండి సుమారు 150 మంది అంగన్‌వాడీలు రైళ్ళు, బస్సులపై విజయవాడకు పయనమయ్యారు. తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో కొంత మందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను కిందకు దింపేశారు. వారిని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మద్యం దుకాణం వద్దంటూ ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

తమ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని కుసుమవారి పేట శ్రీ వెంకటేశ్వర కాలనీ వాసులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామపంచాయతీ కుసుమవారి పేట శ్రీ వెంకటేశ్వర కాలనీ వాసులు ఎదురుగా ఉన్న ఎజి రోడ్‌లో పి.గన్నవరం మండలం ముంగండ గ్రామానికి చెందిన అంబటి కోటేష్ కొంత కాలంగా పీచు ఫ్యాక్టరీ నడుపుతున్నారు. వారి ఫ్యాక్టరీకి చెందిన రోడ్డు పక్కనే గల ఖాళీ స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు ప్రారంభించారు. శ్రీవెంకటేశ్వర కాలనీలో ఒక ప్రాథమిక పాఠశాల, ఒక అంగన్‌వాడీ కేంద్రం, ఒక ప్రార్థనా మందిరం మెయిన్ రోడ్డు పక్కన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ఉన్నాయి. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావం చదువుకునే విద్యార్థులపైన కాలేజీలకు వెళ్ళే యువతీ యువకులు, కూలి పనులు చేసే మహిళలపై పడుతుందని, అధికారులు కలుగజేసుకుని మద్యం దుకాణం నిర్మాణం పనులు నిలుపుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాల్లో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, దళిత సంఘాల నాయకులు బొంతు రమణ, గిడ్ల వెంకటేశ్వరరావు, మెండి డేవిడ్ అంబేద్కర్, జల్లి శ్రీనివాసరావు కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, గెల్ల రాజేంద్ర, సాపే రమేష్, జల్లి నరేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

పిజిఆర్ఎస్‌లో 325 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజల అర్జీలలో సింహభాగం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి సుమారు 325 అర్జీలను కలెక్టర్ మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు శివ శంకర్ ప్రసాద్, మధు సూదన్, ఎస్‌డిసి కృష్ణమూర్తి స్వీకరించారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు మీ కోసం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తే చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ తెలిపారు. అందజేసిన అర్జీల గూర్చి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో సంప్రదించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలని, గడువులోగా అర్జీలను అర్జీదారుల సంతృప్తే ధ్యేయంగా పూర్తిస్థాయి పరిష్కారాలు చూపాలన్నారు. మండల కార్యాలయాల్లో అందజేసిన ప్రతి దరఖాస్తుపై చర్యలు తీసుకుంటామని, తీసుకున్న చర్యలను జిల్లాస్థాయిలో సమీక్షిస్తామని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డిసిహెచ్ఎస్ కార్తీక్, డిపిఓ శాంత లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి సిహెచ్ఎన్‌వి. కృష్ణారెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

రైతులతో చర్చిస్తున్న గారపాటి శ్రీనివాసరావు

శివారుకు సాగునీరు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

శివారు ప్రాంత రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు చౌదరికి తెలిపారు. జొన్నాడ పంట కాలువ మీద ఎగువ రైతుల అడ్డుకట్టలపై దిగువ ప్రాంత రైతులు సోమవారం ఆయనకు ఫిర్యాదు చేసారు. దీనిపై ఆయన ఎగువ ప్రాంతమైన జొన్నాడ, ఆలమూరు, కలవచర్ల గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారితో చర్చించినట్టు తెలిపారు. పంట కాలువకు అడ్డుకట్ట వేయడం వల్ల దిగువ రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించామన్నారు. సాగునీరు వంతుల వారీ విధానంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. సాగునీరు సక్రమంగా అందించేందుకు ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఎగువన ఉన్న రైతులు అడ్డుకట్టు తొలగించేందుకు అంగీకరించారన్నారు. వంతుల వారీ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని ఆయన అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేసారు. ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే రోడ్డులోనున్న భూములను పరిరక్షించాలని అధికారులను కోరారు. ఆ ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఓడలరేవును అభివృద్ధి చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

ఓడలరేవులో ఒఎన్‌జిసి సంస్థ సుమారు 30 ఏళ్ల నుంచి చమురు, గ్యాస్ ఉత్పత్తిని వెలికితీస్తోందని, రూ.వేల కోట్ల ఆదాయం అర్జిస్తోందని, కానీ గ్రావాభివృద్ధికి సహకరించడం లేదని గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ టెర్మినల్స్ నుండి గ్యాస్ చమురు వెలికితీయడం వల్ల భూమి కుంగిపోవడం, భూగర్భ జలాలు పాడైపోవడం, సముద్రం కోతకు గురికావడం, వాయు కాలుష్యం, జల కాలుష్యం మొదలగు సమస్యలతో గ్రామ ప్రజలు భయాందోళనలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామం నుంచి రూ.వేల కోట్లు ఆదాయం అర్జిస్తున్నప్పటికీ ఒఎన్‌జిజి సంస్థ గ్రామాభివృద్ధి విషయంలో ఆమడ దూరంలో ఉందన్నారు. గ్రామం నష్టపోతున్నా ఒఎన్జిసి సంస్థ మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ఒకవైపు సముద్రం కోతకు గురై వందల ఎకరాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయని, భవిష్యత్తులో సముద్రం గ్రామాన్ని ముంచెత్తే ప్రమాదవం ఉంది. ఇటీవలి వాతావరణం మార్పులకు సముద్రం ఒఎన్జిసి టెర్మినల్ గోడను తాకి టెర్మినల్లోనికి చొచ్చుకొని వచ్చిందని, సముద్రంలో పైపులైను నిర్మాణంతో తీర ప్రాంతం మరింత కోతకు గురవుతోంది. ఒఎన్‌జిసి సంస్థ ప్రమోటెక్ అనే కంపెనీకి కాంట్రాక్ట్ బేసిస్‌లో ఉద్యోగులను జాయిన్ చేసుకునే విషయంలో స్థానికులకు అన్యాయం చేస్తోందని అన్నారు. 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలనే విషయంలో నిరాశే మిగులుతోందన్నారు. వెంటనే స్థానికులకు ఉద్యోగావకాశాలు ఇచ్చి ఆదుకోవాలని, ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం కల్పించాలని, ఒఎన్‌జిసి సంస్థ కార్యకలాపాల వల్ల గ్రామం కాలుష్యంలో కోరల్లో చిక్కుకుందని తెలిపారు. ఈ ధర్నాల్లో దెందుకూరి సత్తిబాబు రాజు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, పెచ్చెట్టి రామకృష్ణ, గుండుమేను శ్రీనివాసరావు, కొప్పాడి రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రాజెక్టుల వేగవంతానికి మోనటరింగ్ గ్రూప్

ప్రజాశక్తి-అమలాపురం

మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పర్యవేక్షణ, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, అనుమతులు క్లియరెన్స్‌ల వేగవంతమైన ట్రాకింగ్ కోసం సిఎం అధ్యక్షతన ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్ట్ మోనటరింగ్ గ్రూప్ ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. సోమవారం అమరావతి నుండి రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూపు పోర్టల్‌పై శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను పర్యవేక్షించడం, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేసి అనుమతులు, క్లియరెన్స్‌ల వేగవంతమైన ట్రాకింగ్ కోసం సిఎం అధ్యక్షతన ప్రభుత్వం స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలకు నోడల్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమించినట్టు తెలిపారు. ఐటి అధికారిగా జిఎస్‌డబ్ల్యూఎస్ కో ఆర్డినేటర్ సువిజయ్‌ను నియమించినట్టు తెలిపారు. ప్రాజెక్టుల ఏర్పాటు, వాటి పర్యవేక్షణతో పాటు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రత్యేకంగా స్టేట్ ప్రాజెక్టు మోనిటరింగ్ గ్రూప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర ప్రాజెక్టు పర్యవేక్షణ గ్రూపునకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వైస్ చైర్మన్, ఇంధనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బి, టూరిజం, విద్య, మున్సిపల్, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శులతో పాటు సిఇఒలు మెంబర్లుగా వ్యవహరిస్తారన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో కీలకమైన పాత్ర ఈ గ్రూపు పోషించనున్నట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నిషాంతి

నేడు ముమ్మిడివరంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరి శేష ఒక ప్రకటనలో కోరారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఈ జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. ఈ మేళాలో 2 ప్రముఖ కంపెనీల్లో సుమారు 150కి పైగా ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, అర్హత కలిగిన ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, డి.ఫార్మసి, బి.ఫార్మసి, ఎం.ఫార్మసీ, పీజీ చదివిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ వెంట బయోడేటా, ఆధార్, ఐడి ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు నైపుణ్యాభివద్ధి సంస్థ కో ఆర్డినేటర్‌ను 8341648470, డిపిఒను 8247645389లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో వేణుగోపాలస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా సాగింది. వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా రథాన్ని పూలమాలలతో అలంకరించి గ్రామ వీధుల్లో బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఇఒ రాంబాబు రెడ్డి ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ రవికుమార్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గర్భిణులు ప్రతినిత్యం పౌష్టికాహారం తీసుకుని వైద్య సలహాలు పాటించడం ద్వారా పుట్టబోయే బిడ్డా తల్లీ ఆరోగ్యంగా ఉంటారని అంగర పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.రత్నకుమారి అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అంగర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నిర్వహించిన ప్రత్యేక వైద్య పరీక్షల్లో వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో 21 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, ప్రధానమంత్రి వందన యోజన పథకం, ఆసుపత్రిలో ప్రసవాల ప్రాముఖ్యత, ప్రభుత్వం ద్వారా కలిగే ప్రయోజనాలను డాక్టర్ రత్నకుమారి, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ మల్లికార్జునుడు హెచ్ఇబి రామారావు, స్టాఫ్ నర్స్ జె.బంగారు పాప, హెల్త్ విజిటర్ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి కె.రమాదేవి, ల్యాబ్ ఆలీ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-మండపేట

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గా రాణి మొదటిగా కళాశాల పల్ల వెంకన్న విజిటర్స్ గార్డెన్‌లో మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాలలో రాణించాలని, బాగా చదువుకుని తల్లి దండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో రెడియో అల 90.8 ఎఫ్ఎం స్టేషన్ డెరైక్టర్ సత్య, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు అనూష మాట్లాడారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జెడ్‌పి పాఠశాల క్రీడా ప్రాంగణంలో గత నెలలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించిన మాజీ జెడ్‌పిటిసి, టోర్నీ అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి దంపతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడుని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టోర్నమెంట్ మెమెంటోను మంత్రి అచ్చెన్నాయుడుకు వారు అందజేశారు. టోర్నమెంట్‌కు తాను రావాల్సి ఉన్నప్పటికీ బడ్జెట్ సమావేశాల కారణంగా రాలేకపోయానని మళ్లీ ఏడాది జరిగే టోర్నమెంట్‌కు తప్పక హాజరవుతానని మంత్రి అచ్చెన్నాయుడు తమకు తెలిపినట్టు లక్ష్మీనారాయణ తెలిపారు.

ఆలమూరులో ఎంపిడిఒ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పంచాయతీ కార్యదర్శుల పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి-కె.గంగవరం, ఆలమూరు

గ్రామపంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని కోరుతూ కె.గంగవరం పంచాయతీ కార్యదర్శుల సంఘం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు పని భారం పెరగడంతో కార్యదర్శులు ఆరోగ్యం క్షీణిస్తోందని, నిత్యం పని ఒత్తిడి వల్ల కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని, సెలవులు కూడా లేకుండా పని చేయాల్సి వస్తోందని, ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక సర్వేలు, దీనికి తోడు పంచాయతీలో పని భారం, పన్నుల వసూలు, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ, పారిశుధ్యం, పలు సర్టిఫికెట్ల జారీ వంటి అనేక కార్యక్రమాలతో పని భారం పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గౌతమి, సుబ్బారావు, చంటి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలమూరు మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షురాలు వి.వేణు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ ఐ.రాజుకు వినతిపత్రం అందజేశారు. అనేక రకాల సర్వేలతోపాటు గ్రామాల్లో పలు కార్యక్రమాల పూర్తి బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించడంతో పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయి అనేక మందికి అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి తమకు ఇబ్బందిగా మారిందని ఇటువంటి పరిస్థితుల్లో సర్వేలు ఇతర కార్యక్రమాలు ఒత్తిడి పెరిగిపోయి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మోక్షాంజలి, వీర్రాజు, వీరమాత, వెంకటరత్నం, వెంకట రెడ్డి, వీరన్న చౌదరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లి సూర్య ప్రకాశ్

'యువత పోరు'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పి.గన్నవరం

ఈ నెల 12న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి పి.గన్నవరం నియోజకవర్గం కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్, పార్టీ యువజన విభాగంగా జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ పిలుపు ఇచ్చారు. పి.గన్నవరంలో సోమవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు విద్యా వ్యవస్థకు, యువతకు ఉద్యోగావకాశాలు, నిరుద్యోగ భతి ఇవ్వడంలో వైఫల్యం చెందిందన్నారు. మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరీ దేవి, పార్టీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల ఇంద్రశేఖర్, కొమ్ముల రాము, అంబాజీపేట ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, విద్యార్థి విభాగంగా అధ్యక్షుడు మిందగుదిటి శిరీష్, తోరం గౌతమ్, పితాని నరసింహారావు, వాసంశెట్టి తాతాజీ, యన్నాబత్తుల ఆనంద్, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, అడ్డగళ్ల సాయిరాం, దొమ్మేటి దుర్గారావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన వివిధ చోరీలపై నమోదు అయిన కేసుల్లో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డిఎస్‌పి మనీష్‌దేవరాజ్ పాటిల్ ఈ కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులు, కరప, కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగిన చోరీ కేసులు జరిగాయన్నారు. ఈ కేసుల్లో ముద్దాయిలైన రూరల్ మండలం తూరంగి సత్యదేవనగర్ ప్రాంతానికి చెందిన గంపల సతీష్, కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన పట్టిం వరప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా ఆయా చోరీలను ఉమ్మడిగా చేసినట్లు అంగీకరించారని తెలిపారు. వీరి నుంచి 78 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక హీరో సిడి డీలక్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, క్రైం సిఐ వి.కృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు, ఎఎస్ఐలు గోవిందు, పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని రాజుపాలెం ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన కొప్పన అప్పారావు (29) ఆదివారం రాత్రి అత్తంటికి వీరవరం వెళ్తుండగా రాజుపాలెం సమీపంలో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో రహదారిపై టెంట్ వేసి, రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దీంతో జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఫలితం లేకపోవడంతో డిఎస్‌పి శ్రీహరిరాజు సోమవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన ఆందోళనకారులతో చర్చలు నిర్వహించారు. ఎట్టకేలకు ఆందోళన విరమించారు. దీంతో మృతదేహాన్ని శవ పంచనా నిమిత్తం ప్రత్తిపాడు సిహెచ్‌సి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. మతిడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ బిఎన్.కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని గాదరాడ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేశారని కోరుకొండ సిఐ వై.సత్యకిషోర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు స్పెషల్ పార్టీతో కలిసి దాడి చేయగా పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.84,760 నగదు, 13 సెల్ ఫోన్లు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరానికి చెందిన ముగ్గురు ఆర్గనైజర్లు పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడుల్లో కోరుకొండ ఎస్ఐ టి.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-రావులపాలెం

ఊబలంక శెట్టిబలిజనగర్ రహదారి వద్ద లారీ ఢీకొని ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తికి గాయాలైనట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. పోలీసులు తెలిపన వివరాల ప్రకారం సోమవారం ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి తన భర్త రమేష్‌బాబుతో కలిసి బైక్‌పై కట్టుంగ వెళుతుంగా వెనుకనుంచి లారీ వెనుక వైపు నుండి ఢీకొనడంతో విజయకుమారి(40) మృతి చెందగా ఆమె భర్తకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు : గొల్లప్రోలులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన ఎ.చంద్రరావు గత నెల 26న శివరాత్రి సందర్భంగా పిఠాపురం ఆటోలో బయలు దేరాడు. గొల్లప్రోలు బైపాస్ శ్రీరామ్ స్కూల్ దగ్గరలో ఆగి ఉన్న వ్యాన్‌ను చంద్రరావు ప్రయాణిస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్ర రావు తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి కాకినాడ లోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. పరిస్థితి విషమించడంతో మరణించాడు. కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు

విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

పిఠాపురం : పట్టణ శివారు మాదావపురంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణ పరిధిలోని ఐదో వార్డుకు చెందిన సిహెచ్ సత్యనారాయణ (65) అనే రైతు పశువులకు మేత కోసం పొలానికి వెళ్లి గడ్డి కోసుకుని తిరిగి వస్తుండగా ఆ ప్రాంతంలోని పొలాల పై క్రిందికి వేలాడుతున్న హై టెన్షన్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసేసరికి, అప్పటికే సత్యనారాయణ మృతి చెంది ఉన్నాడు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మతిపై పట్టణ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

సామర్లకోట : మండలంలోని గొంచాల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థి ప్రగాఢ వంశీ(18) దుర్మరణం చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం...సోమవారం ఉదయం చంద్రపాలెం గ్రామం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసేందుకు కాకినాడకు మోటార్ సైకిల్ పై వెళుతుండగా గొంచాల గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఇసక గుట్టపైకి మోటార్ సైకిల్ ఎక్కి జారి పడటంతో అదే సమయంలో వస్తున్న ట్రాక్టర్ వెనుక చక్రాలు విద్యార్థి వంశీ పైనుంచి వెళ్లిపోవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు ఎస్ఐ రమేష్ తెలిపారు

గాయపడిన మహిళ పరిస్థితిపై వైద్యులను ఆరా తీస్తున్న మంత్రి సుభాష్

మానవత్వం చాటిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి - ఆలమూరు

కాకినాడ-జొన్నాడ ఆర్ అండ్ బి రోడ్డుపై మండలంలోని గుమ్మిలేరు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడిన సంఘటనలో మంత్రి సుభాష్ మానవత్వం చాటుకున్నారు. రామచంద్రపురం నుండి అమరావతి అసెంబ్లీకి అదే మార్గంలో బయలుదేరిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మహిళను చూసి తన కాన్వాయ్‌ను నిలిపివేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన స్థానికులు, పోలీస్ సిబ్బంది సహకారంతో ఆమెని మండపేట ప్రభుత్వాసుపత్రికి తన కాన్వాయ్‌లో తీసుకువెళ్లి అత్యవసర వైద్య సేవలు అందించేలా ఆసుపత్రి సిబ్బందికి ఆదేశించారు.

నూకాంబిక ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబికా అమ్మవారి దేవస్థానంలో పడమటి రాజగోపుర నిర్మాణం తదితర అభివృద్ధి పనుల నిమిత్తం ఆలమూరుకు చెందిన సబ్బిశెట్టి వంశీయులు సోమవారం భారీ విరాళం అందించారు. సబ్బిశెట్టి తుకారాం జ్ఞాపకార్థం వారి కుమారులు నాగేశ్వరరావు, వీర వెంకట సత్యనారాయణ మూర్తి, రామసుబ్రహ్మణ్యం రూ.1,00,116ను సోమవారం దేవస్థానం అధికారులకు అందజేశారు. ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి, నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, గన్ని చిన్నబ్బు, చనుమోలు గణేష్, దేశాబత్తుల సత్యనారాయణ, దండంగి వెంకటేశులు, దంతమాల సారబ్బు పాల్గొన్నారు.

కంప్యూటర్, సిసి కెమెరాల అందజేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం సిహెచ్‌సికి కపిలేశ్వరపురానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఫ్లూయింట్ గ్రిడ్ అధినేత గన్నిమని శేష మురళీకృష్ణ సుమారు రూ.లక్షా 50 వేల విలువైన రెండు కంప్యూటర్స్, 12 సిసి కెమెరాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అభ్యర్థన మేరకు వీటిని సమకూర్చినట్టు తెలిపారు. గతంలో దాత శేష మురళీకృష్ణ సిహెచ్‌సికి ఆక్సిజన్ పాయింట్ సమకూర్చారు. ఈ సందర్భంగా దాతను మండపేట ఎంఎల్‌ఎ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురులోని పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. నైనాల తమ్మారావు హైమావతి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజ్యం జగన్నాథ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

'భాష్యం' మురుగు నీటిని అరికట్టాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

భాష్యం స్కూల్ నుండి వచ్చే మురుగు నీటితో కాలనీ ముంపునకు గురవుతోందని, వెంటనే స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డు జిఎంసి బాలయోగి కాలనీని ఆనుకుని ఉన్న భాష్యం ప్రయివేట్ స్కూల్ నుంచి వదిలే మురుగు నీరుతో కాలనీ ముంపు బారిన పడుతోందని, దీంతో కాలనీలో పారిశుధ్య సమస్య ఏర్పడి దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని సోమవారం కమిషనర్ రవివర్మ, చైర్మన్ ప్రవీణ్ కుమార్‌కు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా తిరు కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

మాకనపాలెంలో సత్యనారాయణ స్వామి 73వ తిరు కల్యాణోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సలాది వెంకటేశ్వరరావు నాగమణి దంపతులు పూజలు చేశారు. ఐదు రోజులపాటు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కొత్తపేట

మహిళల ఆర్థికాభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అన్నారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలకు అత్యధిక గౌరవం ఇచ్చే పార్టీ తెలుగుదేశం అన్నారు. తొలి తెలుగు మహిళా స్పీకర్‌ను ఎంపిక చేసిన ఘనత టిడిపికే దక్కిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందని తెలిపారు. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని అనేక పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించారన్నారు.

నరసింహ చంద్రకుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి ఇటీవల కాట్రేనికోనలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీలో అమలాపురం మండలం పాలగుమ్మి జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ చిత్రకళా ప్రదర్శనలో అంజి వేసిన చిత్రాలతో పాటు 40 మంది చిత్రాలను ప్రదర్శించారు. నరసింహ చంద్ర కుమార్ చిత్రాన్ని కూడా ప్రదర్శనలో ఉంచారు.

న్యాయవాది ఈశ్వరరావు మృతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం కోర్టుకు చెందిన న్యాయవాది గుత్తాల ఈశ్వరరావు (62) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం విశాఖపట్నంలో మతి చెందారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కాశి వాని తూము సెంటర్‌కు చెందిన ఈశ్వరరావు న్యాయవాదిగా అందరికీ సుపరిచితులు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మీతికి ముమ్మిడివరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 46 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం జూవాలజీ, మాథ్స్ 11(బి), హిస్టరీ, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 46 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్త పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సరం పరీక్షకు మండలంలోని డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల, అంబేద్కర్ సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 517 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 471 మంది పరీక్షకు హాజరయ్యారని, 46 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఘనంగా పెద్దింట్లమ్మ జాతర

ప్రజాశక్తి -మామిడికుదురు

గోగన్నమఠం శివారు తోట మెరకలో పెద్దింట్లమ్మ తీర్థ మహోత్సవాలు ఆదివారం రాత్రి అమ్మ వారి కల్యాణోత్సవంతో ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి ప్రభతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రీబాయిపూలే 128 వర్ధంతి సందర్భంగా సోమవారం పలుచోట్ల ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రామచంద్రపురం పూలే దంపతుల విగ్రహాలకు మైనార్టీ సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాలు నాయకులు కొల్లపు కామేశ్వరరావు, పడిదడకల భీమ శంకరం, గారోజు సూరిబాబు, వేమవరపు రాంబాబు, పోతాబత్తుల విజయ్ కుమార్, నివాళులలు అర్పించారు. ఆమెకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భారతరత్న ఇవ్వాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కొట్టగల్ల భీమ శంకరం, సూదంశెట్టి గంగాధర్, బిళ్ళకుర్తి స్వామి, మేడిశెట్టి శ్రీనివాస్, షేక్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడిరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మామిడికుదురు మహిళల విద్యాభివృద్ధి,హక్కుల కోసం కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుబ్బల మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు కొనియాడారు. బాలుర వసతి గృహం ఆవరణ ప్రాంగణంలో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నైనాల రఘురామయ్య, రాయుడు నాగేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పి.సాయిబాబు, కుడిపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మండపేట బిసి సంఘం ఆధ్వర్యంలో కోన సత్యనారాయణ నాయకులతో కలిసి సావిత్రీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు వీరమల్లు శ్రీనువాస్, కోన మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం శ్రమించిన సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పెంకే గంగాధర్, సంఘ నాయకులు విన్నకోట రాధాకష్ణ ప్రసాద్, తీగిరెడ్డి మహేష్, పంపన శ్రీనువాస్, ఒంపోలు పోలరాజు, సందక వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం మహిళ విద్యా వ్యాప్తికి జీవితాంతం కృషి చేసిన ధీర వనిత తొలి తరం మహిళా ఉపాధ్యాయిని అని ముమ్మిడివరం అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కొనియాడింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్క్ ఆవరణలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ మరియు అభ్యుదయ సంఘాలు వడ్డి నాగేశ్వరరావు అధ్వర్యంలో సోమవారం సావిత్రి బాయ్ పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనుమాల సుధీర్ తొలుత అంబేద్కర్, సావిత్రీ బాయ్ పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి సమాజంలో హిందూ మతంలో ఉన్న సనాతన మనువాద భావాలను ధిక్కరించి, స్త్రీ విద్యా వ్యాప్తికి సావిత్రీబాయ్ తన భర్త సహకారంతో చదువు నేర్చుకోవడమే కాకుండా, ఎన్నో పాఠశాలలను స్థాపించారన్నారు. అంతే కాకుండా సామాజిక రుగ్మతలైన అంటరానితనం, కుల నిర్మూలనకు విశేష కృషి చెసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనిపల్లి సత్యనారాయణ, శరత్, కాశి సింహాద్రివర్య, రాజశేఖర్, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

లోకోస్ యాప్‌పై యానిమేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఆలమూరు

యానిమేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

డ్వాక్రా మహిళల పూర్తి సమాచారం నిక్షిప్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) పథకంలో భాగంగా రూపొందించిన లోకోస్ యాప్‌పై స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం యానిమేటర్లకు ఎపిఎం ఎం.ధనరాజు, ఎంఎస్‌ఎ ఎం.నవీన్ కుమార్ సుదీర్ఘంగా శిక్షణ ఇచ్చారు. మండలంలో ప్రస్తుతం ఉన్న 1918 డ్వాక్రా సంఘాల వివరాలను పూర్తిస్థాయిలో లోకోస్ యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. అందులో భాగంగా మండల, గ్రామ డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు, సభ్యుల వ్యక్తిగత వివరాలతో పాటు బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలపై వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెలాఖరు నాటికి ఖచ్చితంగా ప్రతి డ్వాక్రా సంఘ సభ్యురాలికి సంబంధించి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వారు సూచించారు. దీనివల్ల భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు నేరుగా డ్వాక్రా మహిళలకు అందించే వీలు కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా యాప్ లోని అంశాలను ప్రొజెక్టర్ ద్వారా స్క్రీన్ పై యానిమేటర్లకు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

సాయం అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

రంగాపురంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సత్తాల చినచింతాలు కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సోమవారం సాయం అందించారు. వంట సామగ్రి, హైజీన్ కిట్, టార్పాలిన్, కూరగాయలు, బియ్యం, దుస్తులు, దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, రెడ్ క్రాస్ సభ్యులు ఆదిత్య కిరణ్, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయ బాబు, రెడ్ క్రాస్ సభ్యులు కుంచే స్వర్ణలత, పట్నాల రమణ, సత్యనారాయణ రెడ్డి, బాలరాజు, శేఖర్, విశ్వనాథం, విఆర్ఓ జి.రాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బొంతు షైనీ, గ్రామ పెద్దలు, ఫీల్డ్ కో ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రికుల సౌకర్యాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

భూమి పూజ చేస్తున్న ఎంఎల్‌ఎ బండారు

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యాల కల్పనక కృషి చేస్తానని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అన్నదాన భవనం, తాత్కాలిక అన్నదాన భవనంలో నిర్మించిన ఫ్లోరింగ్, అదనపు గోశాలను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివద్ధి పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులలో జాప్యం చేయకుండా నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, ఏపుగంటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

13న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పాత మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గల ఆంధ్ర జూబిలీ బాప్టిస్ట్ చర్చిలో ఈ నెల 13వ తేదీన ఉచిత నేత్ర శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షులు బిఎస్.వందనం, రెవ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, నాయకులు ఐఇ.జీవన్‌కుమార్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆంధ్ర జూబిలీ చర్చి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో వైద్య సేవలతోపాటు శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి, వారికి కాకినాడ కిరణ్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తారని తెలిపారు.

సైన్స్ సంబరాల ముగింపు వేడుకలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యార్థులలో అశాస్త్రీయ భావజాలాన్ని పారదోలి, శాస్త్రీయ దృక్పథం వైపు మళ్లించడంలో సైన్స్ ముఖ్య భూమిక పోషిస్తోందని జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ సలీమ్ బాషా అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సైన్స్ సంబరాలు ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డిఇఒ డాక్టర్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సైన్స్ సంబరాల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించ ఉత్తమ ప్రాజెక్టలను ప్రదర్శించి పాఠశాలలకు గుర్తింపు తీసుకురావడం హర్షణీయం అన్నారు. వీరికి శిక్షణ నిచ్చిన సైన్స్ ఉపాధ్యాయుల సమిష్టి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎంఇఒ పి రాంబాబు, ఎఫ్ఎఒ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద

ఆలమూరు : చెత్త నుండి సంపద సృష్టి పనులు వేగవంతం చేశామని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. మండలంలోని చొప్పెల్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ చెత్త సేకరణపై సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి చెత్త నుంచి సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని మండలంలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. సేకరించిన చెత్త నుండి సంపద ఏ విధంగా తయారు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ మండల పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీల సిబ్బందికి ఇచ్చామన్నారు. దీనిని వలన్ల గ్రామంలో పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుందని వివరించారు. కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా వీరబ్రహ్మం

ఆలమూరు : బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుత్తుల వీరబ్రహ్మం ఎన్నికయ్యారు. ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు బొంతు లోకేష్, వనం లక్ష్మణరావు, వాసా దుర్గాప్రసాద్, వైవివి రమణ, వాకా గోవిందరాజు, పివి.రమణమూర్తి, దాసరి సుబ్రహ్మణ్యం, వడ్లమూరి రవీశ్వర్, ఉడతా వెంకటేశ్వరరావు, వి.వంశీ తోపాటు పలువురు ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

In the Court of the VIth Addl. Junior Civil Judge, Rajahmundry
O.S. 47/2024

Between:
Dadi Jaya Madhuri @ Jaya Badhuri ***...Plaintiff***
AND
B.Kanaka Ratnam and Others ***...Defendants***

D-4: Smt. Kandregula Sai, W/o. Nagendra @ Bujji, D.No. 5-204/A, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-9: Smt. Bheesetti Saraswathi, W/o. late Nageswara Rao, D/o. late B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

D-10: Smt. Koyilada Saroja, W/o. K.Ramu, D/o. B.Nagaraju, D.No. 5-204, Raghavendra Colony, Bommuru Village, Rajahmundry Rural.

పై నెంబరులో మీకు నోటీసు నిమిత్తం **ది. 26-3-2025 సంII** తేదీకి శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. కావున మీరు ఆ వాయిదా రోజు **ఉదయం గంII 10.30 నిIIలకు** పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

రాజమండ్రి 10-3-25
సిహెచ్.వి.ప్రసాద్
వాది తరపు అడ్వకేటు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 315/2022

Between:
Peyyala Suseela and Others ***...Petitioners***
AND
J.Srinivasu and Others ***...Respondents***

R-2: P.Sudhakar, S/o. Satyanarayana, Hindu, aged 50 years, R/o. D.No. 1-46-61, T.B.Road, Annajipeta, Tuni, E.G.District, Owner of the vehicle bearing No: AP 01 V 0549 ***...2nd Respondent***

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-3-2025 సంIIరం తేదీ ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 02-3-2025
డి.పల్లవి
అడ్వకేట్స్, రాజమండ్రి

NAME CHANGE

I, VADLAPATI NARESH (Old Name), S/o POORNACHANDHRARAO, D.No.4-227, Rayabhupalapatnam Village, Peddapuram Mandalam, Kakinada District, Andhra Pradesh -533 437. I have changing my name from **VADLAPATI NARESH** (Old Name), to **VADLAPATI NANI** (New Name).Hence forth I am being called as **VADLAPATI NANI** For all purpose.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు గ్రామపంచాయితి జై బీమ్ పేటకు చెందిన దున్నానీలాద్రి S/o రామస్వామి, సర్వే **నెం.182/1ఎ/2లో** గల 2.30 సెంట్లు సంబంధించిన తన బార్య దున్నా పాపయమ్మకి వ్రాసిఇచ్చిన డాక్యుమెంట్ **నెం. 343/2023** గల డాక్యుమెంట్ పోలేకుర్రు గ్రామం నుంచి తాళ్ళరేవు వచ్చు మార్గంలో పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈక్రంది అడ్రస్‌కు తెలియపరచవలెను.

అడ్రస్
దున్నా నీలాద్రి S/o రామస్వామి
డోర్ నెం. 1-7 పోలేకుర్రు, తాళ్ళరేవు మండలం
కాకినాడజిల్లా

ప్రకటన



కీ॥శే॥ రేవు సుందరమ్మ గారు

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఐ.పోలవరం మండలం, ఎదుర్లంక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రామాలయం పేట గ్రామ కాపురస్తురాలు రేవు సుందరమ్మ, W/o. రేవు సుబ్రమణ్యం (లేటు) గారి కుమారుడు రేవు సుధాకర్ వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

నా తల్లి **రేవు సుందరమ్మ** గారు రామాలయం పేట గ్రామంలో మా ఇంటి వద్ద 03-03-2012 సంవత్సరంలో మరణించారు. వీరి మరణం ఎదుర్లంక గ్రామ పంచాయతీలోను మరియు ఏ ఇతర గ్రామపంచాయతీలోను నమోదు కాలేదు. ఏమైన అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: రేవు సుధాకర్
సుబ్రమణ్యం, డోర్ నెం. 1-28, రామాలయం పేట, ఎదుర్లంక (పోస్టు), ఐ.పోలవరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పిన్‌కోడ్: 533464

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 30/2019, O.S. 258/2014

Between:
మహమ్మద్ జకీరా బేగం ***...DHr***
AND

1) మహమ్మద్ హస్నా భాను, W/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 63 సంIIలు, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

2) మహమ్మద్ బషీరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 30 సంIIలు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

3) మహమ్మద్ హాజరా భాను, D/o. మహబూబ్ పాషా, ముస్లిం, స్త్రీ, వయస్సు 27 సంIIలు, డో.నెం. 5-10-5/1, పెద్ద మసీదు వద్ద, వీరమ్మ చెరువు గట్టు, భీమవరం, BVRM JCJC.

యీ నెంబరు డిక్రీ బాకీ వసూలు గాను JDrs తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 21-3-2025వ తేదీన ఉదయం 10.30 నిIIల** లగాయితు శ్రీ కోర్టు వారి ఎదుట వేలం జరుగును. కావలసినవారు వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

పశ్చిమగోదావరి జిల్లా, కొవ్వూరు సబు రిజిష్ట్రీ, కొవ్వూరు మండలం, కొవ్వూరు మున్సిపల్ ఏరియా ఆర్.ఎస్. నెం. 576/1, పూరా చII 396 గజములలో తూర్పు వైపు చII 198 చII స్థలము సమీప డోరు నెంబరు 15-9-69 నకు హద్దులు.

తూర్పు: దుద్దుపూడి నాగేశ్వరరావు స్థలం. **దక్షిణం:** 30 అII వెడల్పు రోడ్డు. **పడమర:** వలగల వెంకటరెడ్డి కోర్టు ద్వారా కొన్న 198 చII ఖాళీ స్థలం. **ఉత్తరం:** దుద్దుపూడి వెంకటకృష్ణ లేవుట్‌లోని ప్లాట్ నెం. 1 మరియు ప్లాట్ నెం. 10.

యీ హద్దుల మధ్య చII 198 గజములు స్థలము యాజిమెంటరీ హక్కులతో సహా.

అమీనా విలువ: రూ. 8,50,000/-
DHr విలువ : రూ. 8,50,000/-
JDrs విలువ: ఏమియున్ను యిచ్చియుండలేదు.

డి.రవిశంకర్
DHr తరపు న్యాయవాది
కొవ్వూరు
కొవ్వూరు
28-2-2025
సెల్: 9848305552